క్లుప్తంగా

నిబంధనలు తప్పనిసరి



పర్వతగిరి : ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు చేశారు. నిబంధనల మేరకు 400–600 చదరపు గజాల స్థలంలో నిర్మించుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో నాణ్యతతో నిర్మించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని మహిళల కోలాటం



రాయపర్తి : మండలంలోని కిష్టాపురంలో వరుణుడు కరుణించాలని కాంక్షిస్తూ మహిళలు గురువారం కోలాటం ఆడారు. అనంతరం దుర్గామాతకు మహిళలు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. దుర్గామాత ఆలయం ఎదుట పసుపు, కుంకుమలతో అలంకరించిన నీళ్ల బిందెలు, వేపమండల మధ్యలో ఏర్పాటు చేసి వానపాటలు పాడారు.

'ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టండి'

నల్లబెల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలను బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు (శుక్రవారం) స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలు

పర్వతగిరి : విద్యుదాఘాతంతో లైన్‌మెన్‌కు గాయాలైన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని జమలాపురంలో లైన్‌మెన్ బాదావత్ బాలు విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా మొదలైంది. దీంతో బాలు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాల పాలైన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సిబ్బంది మధ్య సమాచార లోపం వల్లే ప్రమాదం జరిగిందని తెలిసింది.

బైక్ ఢీకొని వృద్ధుడికి..

వర్ధన్నపేట : బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని చౌటపల్లికి చెందిన గౌరవరపు రామచంద్రు పట్టణంలోని జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. రామచంద్రు తీవ్ర గాయాలుపాలయ్యాడు. స్థానికులు రామచంద్రును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ



గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గంటా శేషగిరిరావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు గురువారం పరామర్శించారు. తొలుత శేషగిరిరావు చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు రడం భరత్, వీరగోని రాజ్‌కుమార్, అల్లం మర్రెడ్డి, డోలె చిన్ని, మాజీ సర్పంచ్‌లు గాజర్ల గోపీ, బోనాల అశోక్, కోల కుమారస్వామి, దౌడు బాబు, గోనె మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్, వీరస్వామి, తదితరులున్నారు.

అనారోగ్యంతో జీపీ కార్మికుడి మృతి

గూడూరు : గూడూరు గ్రామ పంచాయతీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ముల వెంకన్న (49) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సహోద్యోగులతో పాటు కాంగ్రెస్ నాయకులు వెంకన్న మృతి పట్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

యూరియా విక్రయంలో తిరకాసు

- అవసరం లేకున్నా బయో మందులు అంటగడుతున్న వ్యాపారులు

నల్లబెల్లి : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు యూరియా విక్రయంలో తిరకాసు పెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవసరం లేకున్నా బయో మందులు కొంటేనే యూరియా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రైతులు నష్టపోతున్నా వ్యవసాయ, పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.

మండలంలో 29 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు సుమారు 550 ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల 500 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.ఈ పంటల సాగులో యూరియా తప్పనిసరి. మండల పరిధిలో 35 ఫర్టిలైజర్ షాపులున్నాయి. యూరియా కావాలంటే అధిక ధర చెల్లించడం తోపాటు బయో మందులు కొనుగోలు చేయాల్సిందేనంటూ ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇబ్బంది పెడుతున్నారని పలువురు రైతులు తెలిపారు. ఎవరైనా రైతులు ఖచ్చితంగా యూరియా ఇవ్వాలంటే సరుకు లేదని, స్టాకు ఎదురుగా కనపడితే వేరే రైతులు కొనుగోలు చేశారని సాకులు చెబుతూ యూరియా ఇవ్వకుండా రైతులను వెళ్లగొడుతుండడం కనపడుతోంది.

అధిక లాభాల వల్లే..

ఫర్టిలైజర్ షాపుల యజమానులకు బయో మందుల విక్రయంలో అధిక లాభం ఉంటుందని తెలిసింది. ఈ క్రమంలో బయో మందులు కొనుగోలు చేస్తేనే యూరియా విక్రయిస్తున్నట్లు సమాచారం. బయో మందుల విక్రయానికి ప్రభుత్వ అనుమతి ఉన్నప్పటికీ వ్యాపారస్తులు నిబంధనలు ఉల్లంఘిస్తూ అవసరం లేని రైతులకు సైతం అంటగడుతుండడం వివాదాస్పదమవుతోంది.



డీలర్లకు అధికారుల అండ..!

మండలంలోని పలు గ్రామాల్లో వ్యాపారులు కొందరు అధికారుల అండతో రైతులను మోసం చేస్తున్నట్లు విమర్శలున్నారు. గ్రోమోర్ షాపులోనూ రైతులకు బలవంతంగా బయో మందులు అమ్ముతున్నారని తెలిసింది. కొందరు డీలర్లు ఏకంగా తాము సూచించిన బయో మందులు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు ఇస్తాం.. లేకుంటే ఒక్క బస్తా కూడా ఇవ్వం.. ఏం చేసుకుంటారో? చేసుకోండి.. అంటూ దబాయిస్తుండడం కొసమెరుపు.

ఆగ్రోస్, పీఏసీఎస్‌ల్లో విక్రయించాలి

రైతు ఆగ్రోస్ కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా విక్రయించాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు అందరు డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బలవంతంగా బయో మందులు అంటగడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు బహిరంగంగానే మండిపడుతున్నారు. రోజూ యథేచ్ఛగా బయో మందులు అంటగడుతున్నా తనిఖీల సందర్భంగా చర్యలు తీసుకున్న దాఖలాల్లేకపోవడం రైతుల విమర్శలకు బలం చేకూరుస్తోంది. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి రైతులకు బలవంతంగా బయో మందులు అంటగడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కఠిన చర్యలు తప్పవు



వ్యాపారస్తులు రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలి. అవసరం లేని బయో మందులు బలవంతంగా కొనుగోలు చేయించడం నిబంధనలకు విరుద్ధం. పీఏసీఎస్, రైతు ఆగ్రోస్ షాపుల్లో యూరియా నిల్వలు ఉంచేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అధిక ధరలు, అవసరం లేని వాటిని కొనుగోలు చేయాలన్న ఒత్తిడులపై రైతులు ఫిర్యాదు చేస్తే సదరు వ్యాపారులపై ఉన్నతాధికారుల అనుమతితో చర్యలు తీసుకుంటాం.

– బన్న రజిత, ఏఓ

మళ్లీ కాంగ్రెస్ గెలిస్తే చిప్పే గతి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల చేతికి చిప్పే గతి అవుతుందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మహేశ్వర గార్డెన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల స్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కేసులు బనాయించారని తెలిపారు. పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చి బీఆర్‌ఎస్ కీలక నేతలపై కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. మండలంలోని పోలీస్‌స్టేషన్ కాంగ్రెస్ నాయకుల సెటిల్‌మెంట్లకు అడ్డాగా మారిందన్నారు. బ్రిడ్జిల, చెక్‌డ్యాముల, సీసీ రోడ్ల పనులపై కమీషనుల్లు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మండలంలో మెజార్టీ స్థానాలను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు అంకితభావంతో పని చేయాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, ఆ పార్టీ మండల, ప్రధాన కార్యదర్శులు సంగని సూరయ్య, తాటిపల్లి శివకుమార్, నాయకులు అబ్దుల్‌నబి, కొమ్ము రమేశ్ యాదవ్, జాటోతు రమేశ్‌నాయక్, సూరం రాజిరెడ్డి, బొల్లెబోయిన వీరస్వామి, మాదాసు రవి, ఈదునూరి యాకయ్య, గాదె భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలో సమస్యలు

- అంతర్గత రోడ్లు అధ్వానం
- డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- అధికారుల నిర్లక్ష్యం

ఖిలా వరంగల్ : పడమరకోట 37, 38వ డివిజన్ల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సౌకర్యాలు కరువు

ఎస్సీ, ఎస్టీ కాలనీలో జనాభాకు తగ్గట్లుగా సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పడమర కోట జంక్షన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు గుంతలమయమైన సీసీ రోడ్లు, చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేళాపాల లేకుండా తగినంత తాగునీటి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్లపైనే నిలుస్తోందని అంటున్నారు. అపరిశుభ్ర పరిసరాలతో దోమలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. మురుగునీటి కాల్వలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదని తెలిపారు. రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం, వ్యర్థాలతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో వీధి దీపాలు వెలగక అంధకారంలోనే మగ్గుతున్నామని అంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



కాలనీలో గుంతలమయమైన సీసీ రోడ్డు



కాలనీకి వెళ్లే రోడ్డులో చెత్తాచెదారం

రోడ్లను అభివృద్ధి చేయాలి



పడమర కోట జంక్షన్ నుంచి ఎస్సీ, ఎస్టీ కాలనీకి వెళ్లే ప్రధాన సీసీ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. దోమలు, ఈగలతో వ్యాధుల బారిన పడుతున్నాం. నల్లాల నీరు తగినంత రావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

– తోటకూరి రాజేశ్వరి, పడమర కోట

తనిఖీల్లో ద్విచక్ర వాహనం పట్టివేత

రామన్నపేట : వరంగల్ పోచమ్మమైదాన్‌లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో దూరం నుంచి వస్తున్న ఓ వ్యక్తి తను చోరీ చేసిన వాహనాన్ని అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం పోచమ్మమైదాన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో ఓ వాహనదారుడు పోలీసులను గమనించి బైక్‌ను కొద్ది దూరంలోనే ఆపి వదిలి పారిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని గమనించిన హెడ్‌కానిస్టేబుల్ రవి.. ఆ వాహనం వివరాలు తెలుసుకోగా, అది హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన వైనాల రమేష్‌గా గుర్తించారు. సదరు వాహనదారుడికి ఫోన్‌చేసి వివరాలు అడుగగా మే 28వ తేదీన రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనాన్ని దొంగలించారని, హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. వెంటనే సదరు వాహనదారుడికి వాహనం అప్పగించినట్లు సీఐ రామకృష్ణ వివరించారు.

కత్తితో వ్యక్తి హల్‌చల్



పోలీసుల అదుపులో సుజిత్

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నపేటలో బుధవారం అర్ధరాత్రి సమయంలో కత్తితో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన తగురం సుజిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. రాత్రివేళలో కత్తి పట్టుకుని తన ఇంటి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సుజిత్‌ను విచారించగా తాను మద్యం తాగడంతో తల్లి మందలించగా కోపంతో కత్తితో పొడుచుకుంటానని బయటకు రాగా స్థానికులు భయాందోళనకు గురైనట్లు ఆయన తెలిపారని సీఐ వెల్లడించారు.

పాఠశాలల్లో క్రీడాపోటీలు



దుగ్గొండి : బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం కబడ్డీ, ఖో–ఖో, తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు, క్రమశిక్షణకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు రామస్వామి, జ్యోతిలక్ష్మి, భద్రమ్మ, కాళిదాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలపై అవగాహన పెంచుకోవాలి

దుగ్గొండి : పోలీసు సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వల్ప సమస్యలు, భూ పంచాయతీలపై కొందరు డయల్ 100కు ఫోన్ అనవసరంగా ఫోన్ చేస్తున్నారని ఆయన తెలిపారు. భూసమస్యల పరిష్కారం పోలీసుల పరిధిలో లేదని స్పష్టం చేశారు. బాధితులు కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలందిస్తారని తెలిపారు. ఆపద సమయాల్లో, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.

ఎగ్ కార్ట్ అందజేత



పర్వతగిరి : బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్ఈసీసీ కోఆర్డినేటర్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి రేణుక మండలంలోని ఏనుగల్‌కు చెందిన రామగోని రాజు, రామగోని రాజశ్రీలకు గురువారం సుమారు రూ.లక్ష విలువైన ఎగ్ కార్ట్, సామగ్రి అందజేశారు. ఎగ్ కార్ట్‌తో పేదలు ఉపాధి పొందాలని రేణుక ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తొర్రి లక్ష్మణ్‌యాదవ్, నాయకులు వినయ్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

గూడూరు : యోగాతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత కలిగి ఒత్తిడి దూరమవుతుందని యోగా శిక్షకుడు దోసపాటి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) బాలికల విద్యాలయలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో యోగాపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. యోగాతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని వివరించారు. విద్యార్థి దశలోనే యోగా నేర్చుకోవాలని కోరారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

ఐనవోలు : నూతనంగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుభరోసా పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోనివారు, నూతనంగా పట్టా పొందినవారు, బ్యాంకు ఖాతా మార్చుకునేవారు ఆధార్, పట్టాపాస్‌బుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్‌లతో ఏఈఓలను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, హరిరమాదేవి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం మత్తులోనే విధులు

- సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై విచారణ

నల్లబెల్లి : మండలంలోని మూడుచెక్కలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్ మద్యం మత్తులో విధులు నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఈనెల 14న అసిస్టెంట్ లైన్‌మెన్ బాసు మద్యం మత్తులో ఎల్‌సీ తీసుకున్న విషయాన్ని మర్చిపోయి గోవిందాపూర్ ఫీడర్ ఆన్ చేయడంతో లైన్‌తండాలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ నీలం శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురైన విషయం మరవకముందే మూడుచెక్కలపల్లి సబ్‌స్టేషన్ ఆపరేటర్ మధు మద్యం మత్తులో విధులు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల ఫిర్యాదుతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సంపేట ఏడీఈ లక్ష్మణ్ ఏఈ హరిబాబుతో కలిసి మూడుచెక్కలపల్లి సబ్‌స్టేషన్‌ను గురువారం సందర్శించి విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ఆపరేటర్ మధు నుంచి విద్యుత్ సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధు మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించి పోలీసుల సహకారంతో బ్రీతింగ్ అనలైజర్‌తో టెస్ట్ చేయించారు. మధు మద్యం మత్తులో ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఖంగు తిన్నారు. మధుతోపాటు వినియోగదారుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఏడీఈ లక్ష్మణ్ తెలిపారు.



విచారణ చేస్తున్న ఏడీఈ లక్ష్మణ్

ఎమ్మెల్యేపై ఆరోపణలు అర్థరహితం

- కాంగ్రెస్ నాయకులు సంతోశ్, సారయ్య

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ గరీబ్‌నగర్‌కు చెందిన దివ్యాంగురాలు లింగపెల్లి నిర్మలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుండా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు అర్థరహితమని కాంగ్రెస్ నాయకులు దుపాకి సంతోశ్, దాసారపు సారన్న అన్నారు. నిర్మలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ మంజూరు పత్రాన్ని గురువారం వారు అందజేసి మాట్లాడారు. 'కాంగ్రెస్ నాయకులకేనా ఇందిరమ్మ ఇళ్లు..' అంటూ బీఆర్‌ఎస్ కార్పొరేటర్, నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన విషయం తెలియక బీఆర్‌ఎస్ నాయకుల మోసపూరిత మాటలను నిర్మల నమ్మిందని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు లబ్ధి చేకూర్చని సదరు నాయకుల అసత్య ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వల్లెం సుధాకర్, ఆఫ్రీన్, చెక్క లక్ష్మి, పిట్టల అనిల్, తదితరులు పాల్గొన్నారు.



నిర్మలకు మంజూరు పత్రం ఇస్తున్న నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

- మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. మండలంలోని కొలన్‌పల్లి, జయరాంతండా(కె), ఆరెగూడెం గ్రామాల్లో కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేసినట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేయాలని శ్రేణులకు సూచించారు. తద్వారా మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సమావేశాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు జాజునాయక్, చిట్యాల వెంకన్న, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, గ్రామ కమిటీల అధ్యక్షులు వంగాల నర్సయ్య, కడుదుల నర్సింహ, గజవెల్లి ప్రసాద్, చిన్నాల రాజబాబు, బాషబోయిన సుధాకర్, సంకినేని ఎల్లస్వామి, రాము, సతీశ్, సింహాద్రి, పెద్దగోని జీవన్, లావుడ్య నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిమిరెడ్డి

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



రాయపర్తి : కొండూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి రాయపర్తి మండలంలోని కొండూరులో, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి దుగ్గొండిలో, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి నెక్కొండలో కేక్ కట్ చేశారు. పలు చోట్ల నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు.



పర్వతగిరి : బుక్స్ పంపిణీ చేస్తున్న నాయకులు



నెక్కొండ : కేక్ కట్ చేస్తున్న చైర్మన్ హరీశ్‌రెడ్డి



నర్సంపేట : రక్తదానం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు